నల్లగొండ గులాబీమయం

పట్టణమంతా గులాబీ జెండాల రెపరెపలు.. కేటీఆర్ రైతు మహాధర్నా విజయవంతం

- స్వచ్ఛందంగా తరలివచ్చిన అన్నదాతలు
- భారీ గజమాలతో ఘనసత్కారం
- 3 గంటలు కిక్కిరిసిన క్లాక్‌టవర్ సెంటర్
- మిన్నంటిన జై కేసీఆర్, జై కేటీఆర్ నినాదాలు
- దారిపొడవునా కేటీఆర్‌కు నీరాజనం

నల్లగొండ జిల్లా కేంద్రంలో రైతు మహాధర్నాకు వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఘనస్వాగతం పలుకుతున్న అశేష జనవాహిని

నల్లగొండ, జనవరి 28: నల్లగొండ పట్టణం గులాబీ వర్ణమైంది. వాడవాడనా గులాబీ జెండాలు, తోరణాలు రెపరెపలాడాయి. కేటీఆర్ దారిపొడవునా గులాబీ పూల వర్షం కురిసింది. మొత్తంగా కేటీఆర్ రైతు మహాధర్నా విజయవంతమైంది. రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన హామీలు నెరవేర్చని రేవంత్ సర్కారును నిలదీసేందుకు నల్లగొండ పట్టణంలో మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాధర్నాకు వచ్చిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఉమ్మడి జిల్లా రైతాంగం ఘనస్వాగతం పలికింది. ఈ మహాధర్నా కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. తొలుత ఎన్జీ కళాశాల నుంచి భారీ ర్యాలీ ప్రారంభమైంది. బత్తాయి కాయలతో తయారు చేయించిన భారీ గజమాలను స్థానిక మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కేటీఆర్‌కు వేశారు. రైతులు ఈలలు, చప్పట్లతో కేటీఆర్‌కు స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ కొనసాగింది. జై కేసీఆర్, జై కేటీఆర్ అంటూ గులాబీ జెండాలెత్తిన శ్రేణులు, రైతులు నినదించారు. మూడు గంటల పాటు రైతులతో క్లాక్‌టవర్ సెంటర్ ప్రాంగణం కిక్కిరిసింది. ధర్నాకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోర్టు అనుమతి ఇవ్వగా, అంతకుముందే రైతులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కేటీఆర్ మాట్లాడుతున్నంత సేపు రైతులు ఈలలు, చప్పట్లతో మద్దతు పలికారు. సభా ప్రాంగంలో కూర్చోవడానికి స్థలం లేకపోయినా రైతులందరూ నిలబడడే కేటీఆర్ ప్రసంగం విన్నారు. ఈ సందర్భంగా మానుకోట ప్రసాద్‌తోపాటు పలువురు కళాకారులు కాంగ్రెస్ సర్కార్ విధ్వంసకాండపై పాటలు పాడి ఆలోచింపజేశారు. అంతకు ముందు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ నుంచి నల్లగొండకు వచ్చే క్రమంలో పట్టణాలు, గ్రామాల్లో కేటీఆర్ రైతుల నీరాజనాలు అందుకున్నారు. చిట్యాలలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి బీఆర్ఎస్ జెండాను కేటీఆర్ ఆవిష్కరించారు.

కేటీఆర్‌ను చూసి చిన్నారుల కేరింతలు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): అవధులు లేని ఆప్యాయత.. అభిమానం కేటీఆర్ సొంతమనే విషయం మరోసారి రుజువైంది. రైతు మహాధర్నాకు హైదరాబాద్-విజయవాడ హైవే మీదుగా నల్లగొండకు మంగళవారం ఉదయం బయలుదేరారు. మార్గమధ్యంలో కేటీఆర్ పలువురు అభిమానులను ఆప్యాయంగా పలకరించి వారితో కలిసి ఫొటోలు దిగారు. కడపకు చెందిన ఒక కుటుంబంలోని చిన్నారులు వాహనంలో వెళ్తున్న కేటీఆర్‌ను చూసి చేతులూపుతూ, కేరింతలు కొట్టారు. వారి ఉత్సాహాన్ని గమనించిన కేటీఆర్.. కొద్దిదూరంలో రోడ్డుపక్కన తన వాహనం ఆపి చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో ఫొటోలు దిగారు. వాహనం ఆపి మరీ ప్రేమగా పలకరించి అవధులు లేని ఆప్యాయత కనబర్చిన కేటీఆర్‌కు చిన్నారుల కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కల్వకుర్తిలో రైతులపై దాడికి యత్నిస్తున్న రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి

రైతులపై చెయ్యెత్తిన కాంగ్రెస్ నేత

- గిట్టుబాటు ధర, రైతు భరోసా అడిగినందుకు రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడి నిర్వాకం
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

కల్వకుర్తి, జనవరి 28 : మద్దతు ధర కోసం ఆందోళన చేస్తున్న రైతులపై కాంగ్రెస్ నేత చెయ్యెత్తిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. సోమవారం రైతులు పల్లి విక్రయించేందుకు కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున వచ్చారు. మూడు రోజుల్లోనే ధర రూ.600 నుంచి రూ.800 వరకు తగ్గడంతో ఆందోళనకు గురయ్యారు. వ్యాపారులు కుమ్మక్కై ధరలను తగ్గించినా మార్కెట్ పాలకమండలి, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మార్కెట్ కమిటీ ఎదురుగా హైదరాబాద్ చౌరస్తాలో బైఠాయించి రేవంత్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సరిగ్గా అదే సమయంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి వంగూరు మాజీ జెడ్పీటీసీ, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి ధర్నా ప్రాంతానికి వచ్చారు. రైతులను శాంతపరిచే ప్రయత్నం చేశారు. అతడిని చూసిన కర్షకులు మరింత జోరుగా నినాదాలు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం మద్దతు ధర ఏమాయే? రైతు భరోసా ఏమాయే? అంటూ ప్రశ్నించారు. దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం.. సీఎం డౌన్‌డౌన్ అంటూ నినదించారు. కేసీఆర్ పాలనే బాగుందని అన్నారు. దీంతో అసహనం వ్యక్తం చేసిన కేవీఎన్ రెడ్డి రైతులపై చేయి చేసుకునే ప్రయత్నం చేశారు. దీంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంతమంది రైతులను కొడ్తావో కొట్టు అంటూ ఆయనపైకి ఎగబడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు రైతులను అడ్డగించి కేవీఎన్ రెడ్డిని పక్కకు తీసుకెళ్లారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంది. కేవీఎన్ రెడ్డి తీరును నిరసిస్తూ సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నది. గ్రామాలు, మండలాలు, రైతుల గ్రూపుల్లో ఈ వీడియో జోరుగా ఫార్వర్డ్ అవుతున్నది. వీడియోను చూసిన వారు రకరకాల కామెంట్లు పెడుతున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరితే రైతులపై చెయ్యెత్తుతారా? అంటూ రైతుల ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

రుణమాఫీ కోసం బైక్ ర్యాలీ

- నేడు మానుకోట జిల్లా హరిదాసుతండా నుంచి ప్రారంభం : యువరైతు విజయ్

కురవి, జనవరి 28 : ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు శివారు హరిదాసుతండా గిరిజన రైతు భూక్యా విజయ్ బైక్ ర్యాలీ చేపట్టనున్నట్టు ప్రకటించాడు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తనకు మూడెకరాల భూమి ఉందని, బలపాల గ్రామీణ బ్యాంకులో రూ.90 వేలు పంట రుణం తీసుకున్నట్టు తెలిపాడు. లక్షలోపు రుణాలు ఎందుకు మాఫీ కాలేదని అధికారులను అడిగితే రెండు,మూడు, చివరి లిస్టు అంటూ కాలయాపన చేశారని పేర్కొన్నాడు. ప్రతి గ్రామంలో 100 శాతం రుణమాఫీ చేయాలని కోరుతూ బుధవారం నుంచి కురవి మండలం.. ఆ తర్వాత నియోజకవర్గం మొత్తం బైక్‌యాత్ర చేపట్టనున్నట్టు విజయ్ తెలిపాడు. అవసరమైతే రాష్ట్రం మొత్తం యాత్ర చేపడతానని పేర్కొన్నాడు.

బైక్ యాత్ర చేపట్టనున్న భూక్యా విజయ్

జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణరావుపేటలో దీక్షలో కూర్చున్న రైతులు

భూషణరావుపేటలో రైతుల దీక్ష

- రుణమాఫీ, రైతు భరోసా కోసం ఆందోళన

కథలాపూర్, జనవరి 28 : రుణమాఫీ కాలేదని, రైతు భరోసా అందలేదని జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామంలో రైతులు నిరాహార దీక్షకు దిగారు. ముందుగా ప్రభుత్వ పాఠశాల నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాత్మాగాంధీ, తెలంగాణ తల్లి విగ్రహాల వద్ద నిరాహారదీక్ష చేపట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2 లక్షల పంట రుణం మాఫీ చేయాలని, రైతు భరోసా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు అన్ని పార్టీల నాయకులు మద్దతు తెలిపి కూర్చోవడం విశేషం. దీక్షా శిబిరం వద్దకు తహసీల్దార్ వినోద్, ఏవో యోగితా, ఎస్సై నవీన్‌కుమార్ చేరుకుని.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, దీక్షను విరమించాలని కోరారు. ఇప్పటికే రైతు భరోసా నిధులు మూడు సార్లు రావాల్సి ఉండగా.. ఇంకెప్పుడు ఇస్తారంటూ అధికారులను ప్రశ్నించారు. ఈ దీక్షలో రైతు నాయకులు లోక శశిధర్‌రెడ్డి, గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, బద్దం మహేందర్‌రెడ్డి, గడ్డం రాజారెడ్డి, కొండ ఆంజనేయులు తదితరులు కూర్చున్నారు. అధికారుల విజ్ఞప్తి మేరకు రైతులు దీక్ష విరమించారు.

రేవంత్ పాలనలో తెలంగాణ నాశనం

- రైతు మహాధర్నాలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 28: రాష్ట్రంలో పదేండ్ల అభివృద్ధిని ఏడాదిలోనే విధ్వంసం చేసిన రేవంత్‌రెడ్డి పాలనను ఎండగట్టి, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతుల పక్షాన రంగంలోకి దిగారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చెప్పారు. కేటీఆర్ టార్గెట్ రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డి తప్ప ఏ మంత్రి కూడా కాదని పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండలో నిర్వహించిన రైతు మహాధర్నా కార్యక్రమంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమ నేత, తెలంగాణ సాధకుడు కేసీఆర్.. పదేండ్లు సీఎంగా ఉండి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని వివరించారు. పదేండ్ల బంగారు తెలంగాణను ఏడాదిలోనే రేవంత్‌రెడ్డి సర్వనాశనం చేసినందునే బీఆర్ఎస్ పోరుబాట పట్టిందని చెప్పారు. ఈ ధర్నాకు వచ్చిన రైతులను చూస్తే రాష్ట్ర ప్రభుత్వంపై అన్నదాతల్లో ఎంత వ్యతిరేకత ఉన్నదో అర్థమవుతున్నదని చెప్పారు. నల్లగొండ స్ఫూర్తితోనే రాష్ట్ర మంతా బీఆర్ఎస్ తిరిగి రైతుల పక్షాన కొట్లాడుతుందని ప్రకటించారు.

హామీల అమలు ఏమాయె?

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ వరంగల్‌లో నిర్వహించిన రైతు డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదు. కేసీఆర్ రూ.లక్ష రుణమాఫీ చేస్తే, కాంగ్రెస్ రూ.రెండు లక్షలు మాఫీ చేస్తుందని ప్రకటించి రైతులను మోసంచేసింది. అన్ని పంటలకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని చెప్పి సన్న ధాన్యానికే పరిమితం చేశారు.

-రమావత్ రవీంద్రకుమార్, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

ప్రజా వ్యతిరేక పాలన

రాష్ట్రంలో ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకొని ప్రజలను ఇబ్బంది పెడుతున్నది. రాష్ట్రంలో 70% మంది వ్యవసాయంపైనే ఆధారపడ్డ నేపథ్యంలో కేసీఆర్ ఆ రంగాన్ని పండుగలా మార్చారు. 11 దఫాలుగా రైతుబంధు ఇచ్చారు. కానీ కాంగ్రెస్ రైతుబంధు ఎగొట్టింది.

-ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్సీ

అన్ని రంగాల్లో ఆగం

బీఆర్ఎస్ పదేండ్లలో అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఆగిపోవద్దనే ఆలోచనతో ఓపిక పట్టాం. కానీ, కేసీఆర్ పథకాలకు రేవంత్ సర్కారు స్వస్తి పలికి రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నది. రైతుల సమస్యలపై పోరాడేందుకు ధర్నాకు సైతం అనుమతి ఇవ్వకపోవడంతో కోర్టుకు వెళ్లాల్సి వచ్చింది.

-కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

417 రైతు ఆత్మహత్యలు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 417 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 417 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతు వ్యతిరేక విధానాలతో రోజుకో రైతు బలవన్మరణానికి పాల్పడుతున్నాడు. లగచర్ల, రామన్నపేటలో రైతులు, ప్రజలకు కాంగ్రెస్ పెట్టిన బాధలను ఈ రాష్ట్రం మరువదు.

-గొంగిడి సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఫూల్స్ చేసేందుకే..

నాలుగు పథకాలు అమలు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి మండలంలో ఒక్క గ్రామానికే పరిమితం చేశారు. రైతుభరోసా వెంటనే వేస్తామని చెప్పి మార్చి 31 వరకు గడువు పెట్టారు. అదీ గ్యారెంటీ లేదు. ఇదంతా రైతులు, ఇతర ఆశావహులను ఏప్రిల్ 1న ఫూల్స్ చేయడానికే.

-గాదరి కిశోర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

లోకం పోకడ

మాఫీపై మంత్రి చేతులెత్తేశారు

రాష్ట్రంలో రూ.రెండు లక్షలకు మించిన పంటరుణాలున్న రైతులతోపాటు పలు కారణాలతో రూ.రెండు లక్షలకు లోపు ఉన్న రైతులకు రుణమాఫీ కాలేదు. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి వివరిస్తే, ఆయన ఇక చేయలేమని చేతులెత్తేశారు. పాలన చేయలేక వచ్చిన కాడికి దోచుకోవడానికే చూస్తున్నారు.

-నల్లమోతు భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్యే

కోమటిరెడ్డినే చెప్పతో కొట్టాలి

రైతుభరోసా రాలేదన్నవారిని చెప్పుతో కొట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పిన మాటలను రైతులు మర్చిపోలేదు. మూడు సీజన్లుగా రైతుభరోసా ఇవ్వని కోమటిరెడ్డినే రైతులు చెప్పుతో కొట్టాలి. పొద్దున ఒకమాట, సాయంత్రం ఒకమాట మాట్లాడే కోమటిరెడ్డి, గాలి మోటర్లల్లో తిరిగే ఉత్తమ్‌కి రైతుల బాధలు ఏం తెలుస్తాయి.

-బొల్లం మల్లయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే

రేవంత్‌రెడ్డిది రాక్షసపాలన

ప్రజాపాలన తెస్తామంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి రాక్షసపాలన సాగిస్తున్నారు. పథకాలు పూర్తిస్థాయిలో అమలుచేయలేకపోతున్నామని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే అంటున్నారంటేనే రేవంత్ పాలన ఎంత దారుణంగా ఉన్నదో అర్థమవుతున్నది.

-కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

హామీలపై కాంగ్రెస్‌ను నిలదీయాలి

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ఏడాదిగా అమలు చేయలేదు. గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నేతలను ప్రజలు నిలదీసి తరిమికొట్టాలి. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రైతులకు కరెంటు, సాగు నీరు, ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు రాలేదు.

-పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

మోసం చేసిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను మోసం చేసింది. ఏడాదిగా అమలుచేయని పథకాలను స్థానిక ఎన్నికలు రాగానే గుర్తుకొచ్చి దరఖాస్తులు పెట్టిస్తున్నారు. అవి అమలయ్యేది లేదు. రైతులకు ఇచ్చిన హామీలపై అడగడానికి ధర్నా పెడితే కుట్రలతో కాంగ్రెస్ సర్కారు అనుమతి రాకుండా అడ్డుకున్నది. రేవంత్ ప్రభుత్వం త్వరలోనే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

-నోముల భగత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

ఒక్క ఏడాదిలోనే ఆగమాగమైనం

రేవంత్‌రెడ్డి సర్కారు వచ్చాక ఒక్క ఏడాదిలోనే ఆగమాగమైనం. కరెంటు సక్కగ రాక మోటర్లు కాలిపోయినయి. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఒక్కపూట కూడా కరెంటు పోయేది కాదు. ఐకేపీలో వడ్లు అమ్ముకుంటే వారంలోపే బ్యాంకు ఖాతాలో డబ్బులు పడేవి. ఈ సారి నెలరోజులు ఐకేపీలోనే వడ్లకు కాపాలా ఉండాల్సి వచ్చిం ది. కేసీఆర్ ఇచ్చిన రైతుబంధు డబ్బులు ఎరువులు, ఇతర పొలం పనులకు ఉపయోగపడ్డాయి. ఇప్పుడు రైతుబంధు లేదు.. రైతుభరోసా రాలేదు. మళ్లీ కేసీఆర్ వస్తేనే రైతులు సంతోషంగా ఉంటారు.

-సూదిరెడ్డి అమృతారెడ్డి, చిన్నసూరారం, తిప్పర్తి

మేము తీసుకున్న గోతిలో మేమే పడ్డాం

కాంగ్రెస్ పాలనలో రైతులు ఆగమైండ్రు. వద్దు వద్దు అన్నా వినకుండా ఒక్కసారి చూద్దామని కాంగ్రెస్‌కు ఓట్లేస్తే ఏడాదిలోనే 20 ఏండ్ల గోస తీపించిండ్రు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు పత్తికి, వడ్లకు ఏ ఇబ్బందీ లేకుండా మంచి ధరకు అమ్ముకునేది. ఇప్పుడు అడ్డికి పావుసేరు లెక్కన అమ్ముకున్నాం. ఆరేండ్ల నుంచి రైతుబంధు వస్తే పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉండేది. ఇప్పుడు మళ్లీ అప్పులు తెస్తే ఖర్చులు పోను మిగిలింది అంతా మిత్తికే సరిపాయె. మా గోతులు మేమే తోడుకున్నట్టయ్యింది.

-చెరుకు మైసయ్య, అన్నెపర్తి, నల్లగొండ

మహబూబ్‌నగర్ జిల్లా బోయపల్లి రైల్వే గేటు వద్ద రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న పల్లి రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

పట్టాలపై పల్లి రైతు

మొదటిపేజీ తరువాయి...

మాత్రం రూ.5,700 మాత్రమే ఇస్తామని చెప్పడంతో రైతులు కన్నెర్ర చేశారు. దీనికి తోడు తక్కువ తూకంతో మోసానికి పాల్పడుతున్నారని, వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు అడుగుతున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మధ్యాహ్నం 3 గంటలకు ఆందోళనకు దిగారు. దాదాపు 4 గంటలపాటు మార్కెట్ కార్యాలయాన్ని దిగ్బంధించారు. సమీపంలోని బోయపల్లి గేట్ వద్ద రైల్వే లైన్‌పై బైఠాయించారు. అదే సమయంలో అటుగా వస్తున్న గూడ్స్‌ను లోకో పైలట్ చాకచక్యంగా నిలిపివేశాడు. రూరల్, వన్ టౌన్ సీఐలు గాంధీనాయక్, అప్పయ్య ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆందోళన ఉద్రిక్తంగా మారుతుండటంతో ఎస్పీ జానకి రైతుల వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. రైల్వే లైన్‌పై ఉన్న రైతులను సముదాయించి మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. ఓ పక్క ఆందోళన చేస్తుంటే.. మరో పక్క పాలకవర్గంతోపాటు అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని రైతులు మండిపడ్డారు. చివరకు దిగొచ్చిన మార్కెట్ అధికారులు వ్యాపారులతో చర్చించి క్వింటాకు రూ.200 మేర పెంచుతామని హామీ ఇచ్చారు. బుధవారం నుంచి పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో రైతులు శాంతించారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం
1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068.
ఫోన్ నం.లు 040-29803086/3186, ఇ-మెయిల్ : ol.hyderabad@mca.gov.in
ఫారం నెం.63
(రూల్ 148(1) చూడండి)
గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో: అమరావతి వద్ద (ప్రారంభ అధికారపరిధి)
కంపెనీల చట్టం, 1956 విషయంలో
మరియు
మెస్సర్స్ విజేత అగ్రో ఫార్మ్స్ (ఇండియా) లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో
C.P. నం. 128/2005
తమ క్లెయింను నిరూపించుటకు క్రెడిటార్లకు (డిపాజిటర్లు & కార్మికులతో సహా)
నోటీస్ ప్రకటన
పైన తెలిపిన కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) యొక్క క్రెడిటార్లకు (డిపాజిటర్లు & కార్మికులతో సహా) తెలియజేయునదేమనగా కంపెనీల చట్టం, 1956 సెక్షన్ 530 క్రింద ప్రాధాన్యం ఇచ్చుటకు వారి సంబంధిత పేర్లు, చిరునామాలు మరియు డెట్ లేదా క్లెయిం మరియు ఏదేని టైటిల్ వివరాలతో నిర్ణీత ఫారంలో సదరు డెట్ లేదా క్లెయింను నిరూపించు అఫిడవిట్‌తో, **28 ఫిబ్రవరి 2025న లేదా ఆలోగా అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం, 1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068** వద్ద బట్వాడా లేదా సదరు తేదీలోగా అతనికి చేరువిధంగా అఫీషియల్ లిక్విడేటర్‌కు పోస్ట్ ద్వారా పంపించి పైన తెలిపిన కంపెనీపై వారి సంబంధిత డెట్స్ లేదా క్లెయింలను రుజువులను తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం యొక్క అఫీషియల్ లిక్విడేటర్‌కు దాఖలు చేయవలసిందిగా వారికి తెలియజేయడమైనది. ఎవరేని క్రెడిటార్ పైన తెలిపిన విధంగా పరిమిత కాల వ్యవధిలోగా అతని/ఆమె/వారి అఫిడవిట్ రుజువును దాఖలు చేయుటలో విఫలమైతే అతని/ఆమె/వారి డెట్ రుజువు ముందు లేదా సందర్భాన్ని బట్టి సదరు పంపిణీ నుండి డివిడెండ్ పంపిణీ ప్రయోజనం నుండి మినహాయించబడును.
అఫీషియల్ లిక్విడేటర్ నుండి వ్రాతపూర్వకంగా నోటీస్ ద్వారా అతని/ఆమె/వారి రుజువును పంపిన ఎవరేని క్రెడిటార్ (డిపాజిటర్లు & కార్మికులతో సహా) స్వయంగా లేదా అతని/ఆమె/వారి అడ్వకేట్ ద్వారా సదరు నోటీస్‌లో తెలిపిన సదరు సమయం మరియు ప్రదేశం వద్ద సదరు డెట్ లేదా క్లెయిం విచారణకు హాజరు కావలెను మరియు అతని/ఆమె/వారి డెట్ లేదా క్లెయింకు అవసరమైన తదుపరి సాక్ష్యాలను దాఖలు చేయవలెను.
తేది: 24 జనవరి 2025
సం/-
(U.K. సాహూ, ICLS)
అఫీషియల్ లిక్విడేటర్,
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం,
హైదరాబాద్
గమనిక: నోటరీ చేయబడిన రూ.20/- నాన్-జుడీషియల్ స్టాంప్ పేపర్‌పై కంపెనీల (కోర్టు) రూల్స్, 1959 లోని రూల్ 151, 152 మరియు ఇతర వర్తించు రూల్స్ క్రింద మద్దతునిచ్చే డాక్యుమెంట్లతో సహా సందర్భాన్ని బట్టి ఫారం నెం.66 లేదా ఫారం నెం.67లో క్లెయింను దాఖలు చేయవలెను.